క్లుప్తంగా

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానం అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ తదితరులు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలో గల శ్రీ చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీవరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని కోరుతూ దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ తదితరులు కలిసి ఆహ్వానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆమె బ్రహ్మోత్సవాల సందర్భంగా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

బాలాపూర్ కురుమ సంఘం ఎన్నిక



కురుమ సంఘం ఎన్నికల్లో పాల్గొన్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సోమవారం కురుమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం ఏకగ్రీవ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కిష్టగోని సదానందం, జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు సిద్దాల దశరథ హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఇక్కె సత్యనారాయణ కురుమ, ఉపాధ్యక్షులుగా ఆర్ల శంకర్, రావుల మల్లేశ్, నారి సత్యనారాయణ, గుండ్ల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి మల్లికార్జున్, కార్యదర్శులుగా చిన్నంగి రమేష్, ఇమ్మిడి బాబు, జోర ప్రభాకర్, జేవునూరి పూర్ణచందర్, కోశాధికారిగా సిద్దాల జగదీష్, సలహాదారులుగా దడిగ ఐలయ్య, కడారి పెద్దయ్య, చిత్తాపురం సత్తాయ్య, మేకల బాబు, గుండ్ల బీరప్ప, శ్రీనివాస్, బండారి కామేశ్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

న్యాయం చేయాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న సాయిరెడ్డిగూడ వాసులు

కందుకూరు: కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని సోమవారం పలువురు గ్రామస్తులు తమ సమస్యలపై కలిసి వినతిపత్రాలు అందించారు. మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన మల్దేవుల యాదయ్య, ఎం.పాండు అన్నదమ్ములు తమ తండ్రి మరణించిన తర్వాత ఆయన పేరుతో ఉన్న భూమి ఆరు ఎకరాలు ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం తీసుకుని మా పెద్ద అన్న, వదినల పేరుతో సర్టిఫికెట్లు జారీ చేశారని, ఇప్పుడు మా అన్న మాకు వాటా ఇవ్వనంటున్నాడని న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులతో సహా వచ్చి ఆర్డీఓకు తమ గోడు వెల్లబోసుకున్నారు. అనంతరం వివరాలతో కూడిన వినతిపత్రం అందించారు. కాగా తన కొడుకు తనను చూడటం లేదని, కొడుతున్నాడని రావిచేడుకు చెందిన వృద్ధురాలు సత్తమ్మ రోధిస్తూ ఆర్డీఓను కలిసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు. ఆమె కుమారుడిని త్వరగా పిలిపించాలని సిబ్బందికి ఆర్డీఓ ఆదేశించారు. కాగా భూసేకరణకు సంబంధించి ఇద్దరు మరో రెండు అర్జీలు ఆర్డీఓకు అందించారు.

హైదరాబాద్ తరలిన ఆర్టిజన్ కార్మికులు

మహేశ్వరం: విద్యుత్ సంస్థలలో ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని మెహిదీపట్నం లాలానగర్ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికికి మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల్లో పనిచేస్తున్న విద్యుత్ కార్మికులు, ఆర్టిజన్లు పాల్గొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు కోటిగౌడ్, డి.మహేందర్, యాదయ్య, వెంకటయ్య, లాలానాయక్ కార్మికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా

- సాగుకు యోగ్యత లేని భూములను జాబితా నుంచి తొలగింపు
- ఐదురోజుల పాటు కొనసాగిన క్షేత్రస్థాయి సర్వే
- నేటి నుంచి జరిగే గ్రామసభలలో అభ్యంతరాల స్వీకరణ



మహేశ్వరంలో భూముల రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు(ఫైల్)

మహేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా పథకం అర్హులైన రైతులందరికీ అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు అధికార యంత్రాంగం వ్యవసాయ క్లస్టర్ల వారీగా టీమ్‌లను ఏర్పాటు చేసింది. ఈ టీమ్‌లను ఐదురోజులుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి భూములు, రికార్డులను పరిశీలన చేసి అర్హులైన రైతులతో కూడిన జాబితాను సిద్ధం చేయనున్నాయి.

భూ రికార్డుల ఆధారంగా..

ధరణి పోర్టల్ వివరాలు, గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, వ్యవసాయ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారుల రికార్డుల అధారంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీటిని క్లస్టర్ల వారీగా గుర్తించే పని ప్రారంభించారు. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు అధికారులు నాలుగు విభాగాలను అందించారు. ఇందులో 1.ఇళ్ల స్థలాలు, 2.రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లు, పరిశ్రమలు, గనులు, పరిశ్రమలకు ఉపయోగించే భూములు, 3.ప్రభుత్వం సేకరించిన భూములు. 4.గుట్టలు, కొండలు, రాళ్లు, వాగులు, చెరువులు ఉన్న భూములు వ్యవసాయ యోగ్యం కాదని గుర్తిస్తున్నారు.

మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల్లో 6 టీమ్‌లతో సర్వే..

మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాలున్నాయి. అందులో సరూర్‌నగర్ పూర్తిగా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉండడంతో అక్కడ వ్యవసాయ భూములు లేవు. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మూడు మండలాల్లో ఒక్కో మండలానికి రెండేసి టీమ్‌లుగా ఏర్పాటు చేసి మొత్తం ఆరు టీమ్‌లతో సర్వే చేపడుతున్నారు. 2024 సంవత్సరంలో రైతు బంధు కింద మహేశ్వరం-14040 మంది రైతులు, కందుకూరు-19243 మంది రైతులు, బాలాపూర్-1829 మంది రైతులు ఉన్నారు. మొత్తం మూడు మండలాల్లో 35,096 మంది రైతులు ఉన్నారు. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను పరిశీలించేందుకు తహసీల్దార్, ఆర్‌ఐ, ఏఈఓ, గ్రామ పంచాయతీ అధికారులను సభ్యులుగా జిల్లా కలెక్టర్, ఆర్డీఓ నియమించింది. ఈ నెల 16 నుంచి 20 వరకు గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా భూములను గుర్తించే ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

భూభారతి ప్రత్యేక పోర్టల్‌లో నమోదు..

గతంలో రైతుబంధు పంపిణీకి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పోర్టల్‌ను ఏర్పాటు చేసి పట్టాదారుల వివరాలు నమోదు చేసింది. వీటి ఆధారంగానే రైతులకు పెట్టుబడి సహాయం పంపిణీ చేశారు. ఏఈఓలకు లాగిన్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం రైతుభరోసా లబ్దిదారుల వివరాల నమోదుకు భూభారతి పోర్టల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇందులో వ్యవసాయ యోగ్యం అవును, కాదు.. రెండు ఎంపికలు ఉంటాయి. యోగ్యం కాకుంటే తర్వాత ఉండే రిమార్కు కాలంలో నాలుగు విభాగాల్లో సరైంది ఎంపిక చేస్తూ సర్వే కొనసాగింది.

సాగుకు యోగ్యత లేని భూములను తొలగిస్తున్నాం..

రైతు భరోసా పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి సర్వే చేపట్టాం. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాల్లోని రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో టీమ్‌గా ఏర్పాటు చేసి మొత్తం ఆరు టీమ్‌లుగా ఏర్పాటు చేసి గ్రామాల్లో క్షేత్రస్థాయి సర్వే చేపట్టి రికార్డులు పరిశీలించి యోగ్యత లేని భూముల వివరాలను సేకరించాం. రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదు. ఈ నెల 21 నుంచి 23 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఏమైనా అభ్యంతాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తాం. సాగుకు యోగ్యత లేని భూముల వివరాలను గుర్తించాం. ఫైనల్ లిస్ట్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది.

– జగదీశ్వర్‌రెడ్డి, ఆర్డీఓ, కందుకూరు

సర్వే పూర్తి.. సభలు ప్రారంభం

- నేటి నుంచి గ్రామ, వార్డుల్లో సభలు
- సంక్షేమ పథకాల జాబితా వెల్లడించనున్న అధికారులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ కోసం నేటి నుంచి మున్సిపాలిటీ వ్యాప్తంగా వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సోమవారం తెలిపారు. ఈ సభలు మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మంగళవారం రావిర్యాల 1, 2, 3, 4, 5 వార్డులో బుధవారం ఇమామ్ గూడ, మంఖాల్, బసగూడతండాలకు చెందిన 6, 7, 8, 9, 10 వార్డులలో బుధవారం, తుక్కుగూడ, సర్దార్‌నగర్, విలీన గ్రామ పంచాయతీ హర్షగూడ 11, 12, 13, 14, 15 వార్డుల లో గురువారం సభలను నిర్వహిస్తామన్నారు. ఈ సభలను ప్రజలు విజయవంతం చేయాలన్నారు.

అర్హుల గుర్తింపు కోసమే..

ప్రభుత్వం నిరుపేదల కోసం సంక్షేమ పథకాలను అందజేయడానికి నేటి నుంచి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కేఎల్లార్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సభలు మంగళవారం నుంచి ఈ నెల 24వరకు నిర్వహిస్తామన్నారు. ఈ సభల్లో అర్హులైనవారు కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు సహకరించాలన్నారు.

అధికారుల పర్యవేక్షణలో..

కందుకూరు: మండల పరిధిలో 21వ తేదీ నుంచి 24వ తేదీవరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు మంగళవారం ఉదయం 10 గంటలకు పెద్దమ్మతండా, రాచులూరు, గూడూరు, బేగరికంచె, గుమ్మడవెల్లి, పులిమామిడి, బాచుపల్లి గ్రామాల్లో, మధ్యాహ్నం 2 గంటలకు దావూద్‌గూడతండా, బేగంపేట, అన్నోజిగూడ, మీర్‌ఖాన్‌పేట, కొలన్‌గూడ, ధన్నారం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నామన్నారు. ఆయా గ్రామాల్లో ఏడుగురు అధికారుల పర్యవేక్షణలో గ్రామసభలు కొనసాగనున్నాయని ఆమె తెలిపారు.

మీర్‌పేట కార్పొరేషన్‌లో..

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్‌లలో ఈ నెల 21 నుంచి 24వ తేదీవరకు వార్డు సభలు నిర్వహిస్తున్నామని కమిషనర్ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. సభలలో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి అర్హుల జాబితాను ప్రకటిస్తామన్నారు. దీంతో పాటు నూతన దరఖాస్తులను కూడా స్వీకరిస్తామని, సభలకు కార్పొరేటర్లు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో..

పహాడీషరీఫ్: ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల జారీ పథకాలకు సంబంధించి ఈ నెల 21, 22, 24 తేదీలలో జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో వార్డుసభలు నిర్వహించనున్నట్లు కమిషనర్ బి.వెంకట్రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలలో ఆయా పథకాల జాబితా వివరాలు తెలియజేయడంతో పాటు, జాబితాలో పేర్లు లేనివారు, కొత్త దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. పాలక మండలి సభ్యులు సహకరించి ఈ సభలను జయప్రదం చేయాలన్నారు.

తిరుమల బాధితురాలికి చెక్కు అందజేత



బుచ్చమ్మకు చెక్కు అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి

మీర్‌పేట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో టికెట్ కౌంటర్ వద్ద జరిగిన సంఘటన దురదృష్టకరమని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని టీటీడీ బోర్డు సభ్యుడు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డిలు తెలిపారు. తిరుమలలో గాయపడ్డ మీర్‌పేట జిల్లెలగూడ వేంకటేశ్వర కాలనీకి చెందిన పోరెడ్డి బుచ్చమ్మకు టీటీడీ తరఫున రూ.2లక్షల చెక్కును సోమవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆదేశాల మేరకు ఈ ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.25లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.5 లక్షలు, సాధారణంగా గాయపడ్డ వారికి రూ.2లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామని వారు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి వెంకట గాంధీ, చంపాపేట డివిజన్ ఇన్‌చార్జి బైగళ్ల రవిందర్, వనస్థలిపురం డివిజన్ కార్యదర్శి బత్తుల వెంకట ఫణిరాజు, మీర్‌పేట కార్పొరేటర్ల ఎడ్ల మల్లేశ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

మహేశ్వరం: నాగారం-పెద్ద గోల్కొండ ఔటర్ వరకు బీటీరోడ్డు విస్తరణ నిర్మాణ పనులను నాయకులు సోమవారం ప్రారంభించారు. గుంతల రోడ్డుతో నిత్యం వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో ఇటీవల స్థానిక ఎమ్మెల్యే పి.సబితారెడ్డి దృష్టికి స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తీసుకెళ్లగా ఆమె స్పందించి ఆర్‌అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మహేశ్వరరం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బండారి లింగం ముదిరాజ్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన హనుమాన్ దేవాలయ నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి కలిసి 1లక్ష రూపాయలు, గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, సత్తయ్యగౌడ్, నాయకులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్పీ రమేష్

మలక్‌పేట: మలక్‌పేట నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో సోమవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, హైదరాబాద్ సిటీపోలీస్, మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రాచకొండ వింగ్ డీఎస్పీ రమేష్, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, రామ్‌ప్రసాద్, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జరిగే నష్టాలపై అవగాహన కల్పించే వీడియో ప్రదర్శన చూపించారు. డ్రగ్స్‌ని గుర్తించడంలో డాగ్‌స్కిల్స్‌ను ప్రదర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. స్మోకింగ్, ఆల్కాహాల్, గంజాయి, కొకైన్ లాంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దుతా

ఎల్‌బీనగర్: చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోయాయని ఫిర్యాదు మేరకు సోమ వారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ పరిశీలించి చెత్తను తొలగింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్తను తొలగించడంతో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేటర్ వెంట జీహెచ్‌ఎంసీ ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, జవాన్ యాదయ్య, ఎస్ఎఫ్ఏ చంద్రశేఖర్ ఉన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.28, దొండ రూ.42, ఆలుగడ్డ రూ.27, ఉల్లిగడ్డ రూ.29, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.40.

నియామకం

మలక్‌పేట: బీజేపీ అక్బర్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడిగా బి.కిరణ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌యాదవ్ మాట్లాడుతూ.. అక్బర్‌బాగ్‌లో పార్టీని పటిష్టం చేయడానికి, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరీ పీఠం తెలంగాణ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌కు డాక్టరేట్ వరించింది. మధ్యప్రదేశ్ ఇండోర్‌లోని మా భువనేశ్వరి ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇండోర్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందుకున్నారు. గత 2 దశాబ్దాలుగా శ్రీనివాస్ చేస్తున్న అన్నదాన, ఆధ్యాత్మిక, ఉచిత వివాహ సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రజావాణిలో 5 అర్జీలు

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ మూడు సర్కిల్‌ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో 3, ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో 1, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 1 ఫిర్యాదు వచ్చినట్లు డీసీలు పేర్కొన్నారు.

చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్: ప్రజావాణిలో అక్రమ కట్టడాలపై ఫిర్యాదు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేటలోని మూసీ ప్రాంతంలో, అజంపురాలో మరొక ఫిర్యాదు వచ్చాయన్నారు.

విగ్రహావిష్కరణకు ఆహ్వానం

మహేశ్వరం: మండల పరిధిలోని డబిల్‌గూడ గ్రామంలో ఈ నెల 24న గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీసర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సోమవారం ఆయన నివాసంలో గౌడ సంఘం, బీఆర్‌ఎస్ నేతలు ఆహ్వాన పత్రం అందజేశారు. విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో డబిల్‌గూడ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు అల్వాల చంద్రశేఖర్ గౌడ్,ప్రధాన కార్యదర్శి అల్వాల బాలకృష్ణాగౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తొంట రవీందర్,దార జంగయ్య గౌడ్,గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు ఇంద్రకంటి పాండు గౌడ్, అల్వాల ఓం ప్రకాశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్, దేవేందర్ గౌడ్, మహేశ్‌గౌడ్, అఖిల్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

శరవేగంగా శంషాబాద్ అభివృద్ధి

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగవంగా జరుగుతున్నాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని రూ.5 కోట్లతో చేపట్టనున్న 50 పడక ఆస్పత్రి, రూ. 2.6 కోట్ల వ్యయంతో ఔటర్ డోర్ స్టేడియం పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు పూర్తయిన పలు అభివృద్ధి పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో మున్సిపాలిటీలో రూ. వంద కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రభుత్వం ఇటీవలే స్టాంపు డ్యూటీ నిధులతో పాటు ప్రత్యేక నిధులు సైతం విడుదల చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తోందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్లు వై.కుమార్, సంజయ్ యాదవ్, అజయ్, ప్రవీణ్‌గౌడ్, రేఖ, భారతమ్మ, పుష్పలత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న వీరశైవ ఆగమ వేద పాఠశాలలో విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దగ్గు, జ్వరం, జలుబు వంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. సీజనల్‌గా వస్తున్న వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 105 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, అశోక్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో షాబాద్ మండలానికి సంబంధించి మూడు రెవెన్యూ ఫిర్యాదులు, మొయినాబాద్ నుంచి రెవిన్యూకు సంబంధించి ఒక్కటి రైతు బంధు ఇవ్వాలని ఫిర్యాదు వచ్చిందన్నారు. చేవెళ్ల మండలానికి సంబంధించి ధర్మసాగర్ గ్రామస్తులు ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని కోరుతూ గ్రామ నాయకులు, గ్రామస్తులతో వచ్చి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ సంబంధిత అధికారులకు పంపించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.